

సాక్షి గణపతికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: లోక కల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు.



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: దక్షిణమాడ వీధిలోని నిత్యకళా వేదికపై గుడివాడకు చెందిన సిరి కూచిపూడి నాట్య కళాక్షేత్రం వారు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం అలరించింది.



బేస్ క్యాంప్‌ల ఏర్పాటు

నల్లమల అటవీ సంరక్షణకు ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. రుద్రవరం రేంజిలో రెండు బేస్ క్యాంప్‌లను ఏర్పాటు చేసి ప్రొటెక్షన్ వాచర్లను నియమించారు. 8లో▸

న్యూస్‌రీల్

ఎన్నికల విధుల్లో పోలీసుల కృషి అభినందనీయం

● ఎస్పీ కృష్ణకాంత్



కర్నూలు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పోలీసు యంత్రాంగం బాగా పనిచేసిందని ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా సహకరించినందుకు అన్ని వర్గాల ప్రజలకు, రాజకీయ పార్టీలకు, మీడియాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర పోలీసు బలగాలతో పాటు అన్ని శాఖల ఉద్యోగులు కలసికట్టుగా, సమర్థవంతంగా విధులు నిర్వహించారని పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో బాగా పనిచేసిన జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్, కౌంటింగ్ నిర్వహించేందుకు హోంగార్డు స్థాయి నుంచి అడిషనల్ ఎస్పీ స్థాయి వరకు నిర్విరామంగా కృషి చేశారని కొనియాడారు.

నోటాకు 17,923 ఓట్లు

కర్నూలు(అర్బన్): జిల్లాలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నోటాకు 17,923 ఓట్లు పడ్డాయి. అసలు నోటా అంటే ఏంటంటే ... ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులెవరు తమకు నచ్చకపోయినా, ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకుంటు తన అభిప్రాయాన్ని తెలియజేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన అవకాశమే నోటా (నన్ ఆఫ్ ది అబవ్). ఈవీఎంలలో నోటా కూడా ఒక గుర్తు కలిగి చివరన ఉంటుంది. అభ్యర్థుల జాబితాలో ఎవరు నచ్చని సమయంలో ఓటరు నోటాకు ఓటు వేయవచ్చు. ఈ నేపథ్యంలోనే ... ఈ నెల 4వ తేదిన జరిగిన ఓట్ల లెక్కింపులో జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో 17,923 మంది నోటాకు ఓటు వేసి తమకు అభ్యర్థులు నచ్చలేదనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. నియోజకవర్గాల వారీగా చూస్తే ... కర్నూలు 718, పాణ్యం 2,663, పత్తికొండ 2,070, కోడుమూరు 2,169, ఎమ్మిగనూరు 2,380, మంత్రాలయం 3,674, ఆదోని 1,615, ఆలూరులో 2,634 మంది ఓటర్లు నోటాకు ఓటు వేశారు. అలాగే కర్నూలు పార్లమెంట్‌కు సంబంధించి 10,511 మంది ఓటర్లు తమ ఓటును నోటాకు వేశారు.

11 మంది అభ్యర్థులకు 493 ఓట్లు

కర్నూలు(అర్బన్): కర్నూలు శాసనసభ స్థానానికి జరిగిన ఎన్నికల్లో మొత్తం 25 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో 10 మంది పలు రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు కాగా, మిగిలిన 15 మంది స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేశారు. అయితే వీరిలో 11 మంది అభ్యర్థులకు మొత్తం 493 ఓట్లు వచ్చాయి. ఈ స్థానంలో నోటాకు 718 ఓట్లు పోల్ అయ్యాయి. నోటాకు వచ్చినన్ని ఓట్లు కూడా ఈ అభ్యర్థులకు రాకపోవడం గమనార్హం.

ఆశాజనకంగా వర్షాలు



కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయి. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు నాలుగు మండలాల్లో వర్షం కురిసింది. ఒకటి, రెండు మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. పత్తికొండలో 50.4 మి.మీ వర్షపాతం నమోదు కావడం విశేషం. కోసిగిలో 46.2, ఆలూరులో 22.4, ఆస్పరిలో 4.2 మి.మీ వర్షపాతం నమోదైంది. జూన్ నెల సాధారణ వర్షపాతం 77.7 మి.మీ ఉండగా.. నాలుగు రోజుల్లో 40.5 మి.మీ వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి.

ఎన్ఎంఎంఎస్ ఫలితాల విడుదల

కర్నూలు సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా గతేడాది డిసెంబర్ 3వ తేదీన జరిగిన జాతీయ ఉపకార వేతన పరీక్ష(ఎన్ఎంఎంఎస్)కు సంబంధించిన ఫలితాలు విడుదల అయినట్లు డీఈఓ కె.శామ్యూల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలు www.bse.ao.gov.in లో తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు. జాతీయ విద్యా మంత్రిత్వ శాఖ నియమాల ప్రకారం ఎంపిక అయిన విద్యార్థులు వెంటనే జాతీయ బ్యాంకులో విద్యార్థి పేరున సేవింగ్స్ ఖాతా తీసుకుని తండ్రి/తల్లి జాయింట్ చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థి ఆధార్ నంబరుతో అకౌంట్‌కు అనుసంధానం చేయించుకోవాలన్నారు.

విజయం 'స్వల్పమే'

కేవలం 1,10,749 ఓట్ల తేడాతోనే టీడీపీ విజయం

- 6.7 శాతం ఓట్లతో 5 స్థానాల్లో గెలుపు
- పొత్తులో భాగంగా లాభపడిన బీజేపీ
- ఆలూరు, మంత్రాలయంలో పట్టు నిలుపుకున్న వైఎస్ఆర్‌సీపీ
- పాణ్యం, పత్తికొండలో ప్రభావం చూపని కామ్రేడ్‌లు
- నోటాకు 1.13 శాతం ఓట్లు
- 25 ఏళ్ల తరువాత టీడీపీకి కర్నూలు ఎంపీ స్థానం



ఓట్లు లెక్కిస్తున్న దృశ్యం (ఫైల్)

కర్నూలు(సెంట్రల్): సార్వత్రిక ఎన్నికల ఉత్కంఠకు తెరపడింది. హోరాహోరీ పోరులో ఉమ్మడి జిల్లాలో కూటమి అభ్యర్థులు ఊహించని విజయం సాధించారు. మొత్తం 14 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ రెండుచోట్ల విజయం సాధించగా.. 12 స్థానాల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందారు. ఇక రెండు పార్లమెంట్ స్థానాలను కూడా టీడీపీ కైవసం చేసుకుంది. మే 13న జరిగిన పోలింగ్‌లో కర్నూలు జిల్లాలోని కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల్లో 15,84,009 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో తెలుగుదేశం పార్టీ పోటీ చేసిన అన్ని నియోజకవర్గాల్లో కలిపి ఆ పార్టీకి 7,08,893 ఓట్లు పోలయ్యాయి. ఇక వైఎస్ఆర్‌సీపీ 5,98,144 ఓట్లు దక్కించుకుంది. ఈ రెండు ప్రధాన పార్టీల మధ్య ఓట్ల తేడా 1,10,749 మాత్రమే. ఈ తేడాతోనే వైఎస్ఆర్‌సీపీ ఆరు స్థానాలను కోల్పోయింది. మంత్రాలయం, ఆలూరులో మాత్రమే వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థులు వై.బాలనాగిరెడ్డి, బి.విరుపాక్షి విజయం సాధించారు. కౌంటింగ్‌లో టీడీపీ 50.05 శాతం ఓట్లు దక్కించుకోగా.. వైఎస్సార్‌సీపీకి 43.35 శాతం ఓట్లు పోలయ్యాయి. అంటే టీడీపీ 6.7 శాతం ఓట్ల స్వల్ప తేడాతో గెలుపును సొంతం చేసుకుంది.

ప్రభావం చూపని ఇండియా కూటమి

మరోవైపు ఇండియా కూటమిలో భాగంగా పోటీ చేసిన కాంగ్రెస్, సీపీఎం, సీపీఐలు ఈ ఎన్నికల్లో ఏ మాత్రం ప్రభావం చూపలేక పోయాయి. కాంగ్రెస్ పార్టీ మొత్తంగా 70వేల ఓట్లను దక్కించుకుంది. పత్తికొండలో పోటీచేసిన సీపీఐ అభ్యర్థి పి.రామచంద్రయ్యకు 1,956 ఓట్లు.. పాణ్యం నుంచి పోటీ చేసిన సీపీఎం అభ్యర్థి డి.గౌస్‌దేశాయ్‌కు 3,081 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఇండియా కూటమిలో భాగంగా పోటీ చేసిన కాంగ్రెస్ కర్నూలులో 9,022, కోడుమూరు 9,835, ఆలూరు 5,772, ఆదోని 7,622, మంత్రాలయం 4,660, ఎమ్మిగనూరులో 7,831 ఓట్లు సాధించింది.

నోటాకు 17,923 ఓట్లు

జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నోటాకు ఓట్లు భారీగానే వచ్చాయి. పోటీ చేసిన అభ్యర్థుల్లో ఎవరూ నచ్చకపోతే నోటాకు వేటు వేయవచ్చు. అందులో భాగంగా నోటాకు 1.13 శాతంతో మొత్తం 17,923 ఓట్లు పోలయ్యాయి. కాగా, నోటాకు ఎక్కువగా మంత్రాలయంలో 3,674 ఓట్లు పడ్డాయి. అత్యల్పంగా కర్నూలులో 718 ఓట్లు పోలయ్యాయి. సీపీఎం, సీపీఐలకు నోటాకు పడినన్నీ ఓట్లు కూడా రాకపోవడం గమనార్హం.

టీడీపీ పొత్తుతో లాభపడిన బీజేపీ

ఎన్‌డీఏ కూటమిలో భాగంగా బీజేపీ ఆదోని నుంచి పోటీ చేసింది. ఎవరూ ఊహించని విధంగా ఇక్కడ టీడీపీ, జనసేన పొత్తుతో బీజేపీ లాభపడింది. ఆ పార్టీ తరపున పోటీ చేసిన డాక్టర్ పార్థసారధికి 89,929 ఓట్లు రాగా, వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి వై.సాయిప్రసాద్‌రెడ్డికి 77,765 ఓట్లు పోలయ్యాయి.

25 ఏళ్లకు కర్నూలు ఎంపీ స్థానాన్ని గెలిచిన టీడీపీ

కర్నూలు ఎంపీ స్థానాన్ని తెలుగుదేశం పార్టీ 25 ఏళ్ల తరువాత గెలిచింది. గతంలో 1999లో టీడీపీ తరపున కేఈ కృష్ణమూర్తి.. కోట్ల విజయభాస్కరరెడ్డిపై విజయం సాధించారు. అంతకు ముందు 1984లో ఏరాసు అయ్యపురెడ్డి కర్నూలు ఎంపీగా టీడీపీ తరపున గెలిచారు. ఈ క్రమంలో 25 ఏళ్ల తరువాత రాజకీయాలకు పూర్తిగా కొత్త వ్యక్తి అయిన బస్తిపాటి నాగరాజు ఎంపీగా నెగ్గారు. వెనుకబడిన వర్గానికి చెందిన బస్తిపాటి నాగరాజు తొలిసారి పార్లమెంట్‌లో అడుగు పెట్టబోతున్నారు. కాగా, టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు 1,11,298 ఓట్లతో వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి బీవై రామయ్యపై విజయం సాధించారు.

తొలిసారి చట్టసభల్లోకి..

కర్నూలు జిల్లాలో తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన కేఈ శ్యామ్‌బాబు, టీజీ భరత్, బొగ్గుల దస్తగిరి, వి.పార్థసారధి, విరుపాక్షి చట్టసభల్లో అడుగు పెట్టబోతున్నారు.

- కేఈ శ్యామ్‌బాబు.. కేఈ కృష్ణమూర్తి వారసుడిగా 2019లో పోటీ చేసినా ఓటమి పాలయ్యారు. తాజా ఎన్నికల్లో పత్తికొండ నుంచి విజయం సాధించారు.
- పారిశ్రామిక వేత్త టీజీ వెంకటేష్ కుమారుడు టీజీ భరత్ తొలిసారి కర్నూలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019లో పోటీ చేసినా వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి చేతిలో ఓటమి పాలయ్యారు.
- కోడుమూరు నుంచి రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేని బొగ్గుల దస్తగిరి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు.
- ఎంతో కాలంగా బీజేపీ తరపున రాజకీయాలు చేస్తున్న డాక్టర్ వి.పార్థసారధి తొలిసారి ఆదోని నంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. జిల్లా బీజేపీ చరిత్రలో ఈయనే తొలి ఎమ్మెల్యే కావడం విశేషం.
- ఇక అతి సామాన్య వెనుకబడిన కులం నుంచి వచ్చిన బి.విరుపాక్షి సీఎం వైఎస్ జగన్ ప్రోత్సాహంతో చిప్పగిరి జెడ్పీటీసీగా గెలుపొందారు. ఆయననే 2024లో ఆలూరు ఎమ్మెల్యేగా వైఎస్ఆర్‌సీపీ నిర్ణయించడంతో పోటీ చేసి గెలుపొందారు. ఈయనకు కూడా చట్ట సభల్లో తొలిసారి అడుగు పెట్టబోతున్నారు.
- ఇక గెలిచిన వారిలో వై.బాలనాగిరెడ్డి నాలుగోసారి, గౌరు చరితారెడ్డి మూడోసారి, బి.జయనాగేశ్వరరెడ్డి రెండోసారి విజయం సాధించారు.

నియోజకవర్గం	మొత్తం పోలైనట్లు	టీడీపీకి వచ్చిన ఓట్లు	ఓటింగ్ శాతం	వైఎస్ఆర్‌సీపీకి వచ్చిన ఓట్లు	ఓటింగ్ శాతం	బీజేపీకి వచ్చిన ఓట్లు	ఓటింగ్ శాతం	కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లు	ఓటింగ్ శాతం	నోటాకు వచ్చిన ఓట్లు	ఓటింగ్ శాతం
ఆదోని	176133	---	---	71765	40.74	89929	51.06	7622	4.33	1615	0.92
ఆలూరు	210429	97433	46.3	100264	47.65	---	---	5772	2.74	2634	1.25
కోడుమూరు (ఎస్సీ)	197533	101703	51.49	80120	40.56	---	---	9835	4.98	2169	1.1
కర్నూలు	178594	91690	51.34	72814	40.77	---	---	9022	5.05	718	0.4
మంత్రాలయం	176324	74857	42.45	87662	49.72	---	---	4660	2.64	3674	2.08
ఎమ్మిగనూరు	203089	103089	50.76	87252	42.96	---	---	7831	3.86	2380	1.17
పత్తికొండ	191631	98849	51.58	84638	44.17	1956 (సీపీఐ)	1.02	---	---	2070	1.08
పాణ్యం	250276	141272	56.45	100681	40.23	3081 (సీపీఎం)	1.23	---	---	2663	1.06
మొత్తం	15,84,009	7,08,893	50.05	5,98,144	43.35			39542	3.93	17923	1.13
పార్లమెంట్	1330780	658914	49.51	547616	41.15			70373	5.29	10511	0.79

క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వై. ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం కర్నూలు మెడికల్ కాలేజీలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్‌పై జిల్లా స్థాయి మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా నుంచి ఏడుగురు వైద్యుల బృందం విశాఖపట్టణంలో నిర్వహించిన క్యాన్సర్ స్క్రీనింగ్‌పై రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన వైద్యుల బృందం ఇప్పుడు జిల్లా స్థాయి మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో జిల్లా పరిధిలోని ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న వైద్యులకు శిక్షణ ఇస్తున్నారన్నారు. అనంతరం ఇక్కడ శిక్షణ పొందిన వారు యుపీహెచ్‌సీ, పీహెచ్‌సీలలోని వైద్యులకు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు శిక్షణ ఇస్తారన్నారు. ఆ తర్వాత వారు తమ పరిధిలోని క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహిస్తారని వివరించారు. కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ చికిత్స కన్నా నివారణ మిన్న అనే నానుడిని బట్టి క్యాన్సర్ నివారణ గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల క్యాన్సర్ విభాగాధిపతి డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్ మాట్లాడుతూ సాధారణంగా రొమ్ము, నోటి, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లు అధికంగా వస్తాయని, వీటిని వీలైనంత త్వరగా గుర్తించి చికిత్సలు చేయించుకోవడం వల్ల త్వరగా నయం అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే పీవో హేమలత, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ పద్మవిజయశ్రీ, మాస్టర్ ట్రైనర్స్ డాక్టర్ నాగరాజు, డాక్టర్ సాయిమాధురి, డాక్టర్ స్నేహ, డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ శాంత, డాక్టర్ దిలీప్‌కుమార్, డాక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కుంటలో పది కిలోల చేప



దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామ శివారులోని రేగుమాను కుంటలో పది కిలోల చేప చిక్కింది. కోవెలకుంట్ల మండలం పొట్టిపాడు గ్రామానికి చెందిన జాలరులు మంగళవారం చేపల కోసం కుంటలోకి దిగారు. చిన్నచిన్న చేపలు మాత్రమే వలలోకి పడగా ఓ పెద్ద చేప వలను తెంపేసుకుని చిక్కకుండా వెళ్లిపోయింది. అయితే జాలరులు బుధవారం మరో రెండు వలలతో వెళ్లి చేపను చిక్కించుకున్నారు. ఇంత చిన్న కుంటలో 10 కిలోల చేప దొరకడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు 10 వరకు గడువు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రంలో మొదటి విడత ప్రవేశాలకు ఈనెల 10 వరకు గడువు ఉన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ITI.AP.GOV.IN వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు కళాశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకావాలన్నారు. అనంతరం 18 నుంచి 26వ తేదీలోపు డోన్ ప్రభుత్వ ఐటీఐలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. ఐటీఐ విద్యార్హతతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించే ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలుంటాయన్నారు. పదవ తరగతి పాస్/ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

మొక్కలను పెంచుదాం



మాట్లాడుతున్న ఎంవీఎస్ ప్రసాదు

కర్నూలు(సెంట్రల్): మానవ మనుగడకు ఆధారమైన మొక్కలను విరివిగా పెంచుదామని కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త పర్యావరణ ఇంజినీరు ఎంవీఎస్ ప్రసాదు పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పీసీబీ కార్యాలయంలో భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును జయించే మార్గాల అన్వేషణ విషయంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను నాటి సంరక్షించకపోతే భవిష్యత్ అంధకారంగా మారుతుందన్నారు. మొక్కలు నాటితేనే వర్షాలు పడి కరువును జయించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ..ప్రపంచ పర్యావరణం ఆపదలో ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిక్షణకు పాటుపడాలన్నారు. ఒకవైపు ఎండల తీవ్రత పెరుగుతుండడం , వర్షాలు సరిగా పడకపోవడంతో ప్రపంచం అల్లాడిపోతుందన్నారు. అనంతరం ప్రాంతీయ పర్యావరణాధికారి బీవై మునిప్రసాదు మాట్లాడుతూ..పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. అంతకముందు కర్నూలు రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన మిషన్ లైఫ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బిట్స్ డైరక్టర్ గిరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

కమనీయం.. ఉమామహేశ్వరుల కల్యాణం



శివపార్వతులకు కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వర స్వామికి మాసశివరాత్రి సందర్భంగా బుధవారం కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ఆలయంలో ఏక శిలారూపంలో కొలువైన ఉమామహేశ్వరులకు ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తోట బుచ్చిరెడ్డిల ఆధ్వర్యంలో అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను వధువరులుగా ముస్తాబు చేసి కల్యాణాన్ని నిర్వహించారు.

అనుమానాలెన్నో?

సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై ప్రజలు పలు అనమానాలను లేవనెత్తుతున్నారు. వైఎస్సార్‌సీపీకి భారీగా ఓట్లు వేసినా టీడీపీకి మెజార్టీ ఎట్లా వస్తుందని ప్రశ్నిస్తున్నారు. ఫలితాలు నమ్మశక్యంగా లేవని, ఈవీఎంలలో ఏమైనా తేడా జరిగి ఉండవచ్చని, ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరుతున్నారు. -సాక్షినెట్‌వర్క్

తారుమారు అయ్యాయేమో!



ఈ ఫలితాలను చూస్తుంటే అంతు చిక్కని అనుమానాలు ప్రతి ఒక్కరికీ వస్తున్నాయి. ఫలితాలు తారుమారు అయ్యాయేమో అనే సందేహాలు ఉన్నాయి. పార్టీలకతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయి. మహిళలు, రైతులు ఫ్యాన్‌కు వేసి ఓట్లు ఏమైనాయి? ఎక్కడికి వెళ్లాయి? మరీ ఇంతలా ఓట్లు మారాయి అంటే అర్థం కావటం లేదు? అందరి ఓట్లు పడ్డాయి.. వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం అనుకున్నాం. మరీ ఇంత ఘోరంగా ఓడిపోవడానికి కారణాలు తెలియం లేదు. ఈవీఎంలో ఏమైనా జరిగాయా అనే అనుమానాలు వ్యక్తం అవుతుంది. – గొల్ల కేశన్న, ఎమ్మిగనూరు

దొంగదెబ్బ తీయరాదు



గెలుపోటములు సర్వసాధారణం. ఎవ్వరు అయినా సరే వాటిని సమానంగా స్వీకరించే మనస్తత్వం ఉండాల. చేతనైతే ప్రజల మనస్సు గెలిచి వారు వేసే ఓట్లుతో గెలవాల కానీ ఇలా దొంగదెబ్బ తీయరాదు. మోసం ఎప్పటికీ చివరి వరకు నిలవదు. గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాల్లో ఏ మహిళను అడిగినా, ఏ పేదోడిని అడిగినా మాకు జగనే కావాలి అనేవారు. ఆయనకు తప్ప ఎవ్వరికీ ఓటు వేయం అని ఖరాఖండిగా చెప్పి ఫ్యాన్ గుర్తుకే ఓటు వేశారు. నేడు ఫలితాల్లో మాత్రం కూటమికి ఆధిక్యం రావడం చూస్తుంటే అనుమానం వస్తోంది. దీనిపై ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. – బి.రామ్మోహన్‌రెడ్డి, పెద్దకడబూరు

ఫలితాలు ఆశ్చర్యానికి గురి చేశాయి



గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ జగనన్న నెరవేర్చారు. ప్రజలు కూడా జగనన్న పిలుపు మేరకు ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి భారీగానే ఓట్లు వేశారు. మేం కూడా వైఎస్సార్‌సీపీకే ఓట్లు వేశాం. ఓటింగ్ సరళిని కూడా పరిశీలించా. తీరా ఫలితాల్లో చూస్తే టీడీపీకి భారీగా మెజార్టీ వచ్చింది. ఏమి జరిగిందో తెలియడం లేదు. వైఎస్సార్‌సీపీకి పట్టున్న వార్డుల్లోనూ టీడీపీకి మెజార్టీ చూపిస్తుంటే అనుమానం వస్తోంది. – రమేష్‌నాయుడు, కోడుమూరు

నమ్మశక్యంగా లేదు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ, వలంటరీ వ్యవస్థ, రైతుభరోసా కేంద్రాలతో విప్లవాత్మక మార్పులు చేశారు. నవరత్నాల పథకాలు ప్రజలకు అందించారు. ప్రజలంతా వైఎస్సార్‌సీపీ పక్షాన ఉన్నాయి. అయినా రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ 11 స్థానాలకే పరిమితం కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆలూరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షికి కేవలం 2 వేల పై చిలుకు మెజార్టీ రావడంపై కూడా అనుమానాలు ఉన్నాయి. నియోజకవర్గమంతా ఎక్కువ సంఖ్యలో వైఎస్సార్‌సీపీకి ఓటర్లు ఓటు వేశారు. మెజార్టీ తగ్గడం నమ్మశక్యంగా లేదు. – వడ్డే శంకరప్ప, గూళ్యం గ్రామం, హోలహర్వి

మరీ ఇంత దారుణమా?



175 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసిన వైఎస్సార్‌సీపీ చివరకు 11 స్థానాలకే పరిమితం కావడం నమ్మలేకుండా పోతున్నాం. ఇదంతా కూటమి పన్నాగమేనని అనిపిస్తోంది. మోసపూరితమైన విధానాలను పాటిస్తూ ఓట్లు సంపాదించుకున్నట్లు అనుమానాలు ఉన్నాయి. ఇంతటి దారుణం మరెక్కడా లేదు. ప్రజల మెప్పు పొంది ఓట్లు పొందాలి. దొడ్డిదారిన గెలవడం మరీ దారుణం. బైచిగేరి గ్రామంలో నాతోపాటు స్నేహితులు కొంతమంది వైఎస్సార్‌సీపీకి ఓటు వేశాం. అయినా ఫలితాల్లో కనిపించడం లేదు. మైనస్ వచ్చింది. ఇది ఎలా సాధ్యం? పోలింగ్‌పై విచారణ చేసి న్యాయం చేయాలి. – వి.మహాదేవ, బైచిగేరి గ్రామం, ఆదోని మండలం

ఏం జరిగిందో ఏమో?



జగనన్న ప్రభుత్వంలో వ్యక్తిగతంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందా? నాలుగు సంవత్సరాలు బీఫార్మసీ చదివేందుకు అయ్యే ఖర్చు ప్రభుత్వం చెల్లించింది. ఆర్థికంగా లబ్ధి పొందాను. అందుకే ఈ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీకి ఓటు వేశా. వ్యక్తిగతంగా ప్రభుత్వంపై అభిమానం ఉంది. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వం ఎంతో మంచి చేసింది. నాతోటి మిత్రులు ఎంతో మంది ఉన్నారు. వారంతా కూడా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేశారు. ఏం జరిగిందో ఏమో ఫలితాలు విరుద్ధంగా వచ్చాయి. – మధు, సీక్యాంపు, కర్నూలు

చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి



ఓటింగ్ సరళి ఒక మాదిరి, ఫలితాల వెల్లడి మరోలా ఉంది. మా గ్రామంలో మొత్తం 1,417 ఓట్లు ఉండగా 1,313 ఓట్లు పోలయ్యాయి. ఓటింగ్ సరళిని బట్టి మా గ్రామం నుంచి వైఎస్సార్‌సీపీకి 200 నుంచి 250 వరకు మెజార్టీ వస్తుందని అనుకున్నాం. తీరా ఫలితాలు వెల్లడి అయ్యాక వైఎస్సార్‌సీపీకి మెజార్టీ రాక పోగా టీడీపీకి 20 ఓట్లు ఎక్కువ వచ్చాయి. ఫలితాలపై అనుమానాలు మరింత బలపడ్డాయి. మా మండలంలోని చాలా గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. – ఆర్‌బీ వెంకటరాముడు, అలంకొండ, కృష్ణగిరి మండలం

మరోసారి పరిశీలించాలి



వృద్ధులు, మహిళలు, సంక్షేమ పథకాలు పొందిన ప్రతి ఒక్కరూ అర్ధరాత్రి వరకు క్యూలో నిలబడి ఓటు వేశారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేశామని మాతో ఆనందాన్ని పంచుకున్నారు. అయితే ఫలితాలు ఓటింగ్‌కు సంబంధం లేకుండా వచ్చాయి. మేమంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా ఓట్లు వేశామని, ఫలితాలు అవి కనిపించలేదని చాలా మంది ఓటర్లు ఆశ్చర్యపోతున్నారు. ఏమి జరిగిందో ఎవ్వరికీ తెలియదు. ఫలితాలను మరోసారి పరిశీలించాలి. – నద్దల శ్రీనివాసరెడ్డి, పాణ్యం

ఆ ఓట్లన్నీ ఎక్కడికి వెళ్లినట్లు?



ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఈ ఐదేళ్లలో కళ్లెదుటే అభివృద్ధి కనిపిస్తోంది. ఎలాంటి వివక్షకు తావులేకుండా పాలన సాగించడం ఆయనకే చెల్లు. అందుకే ఎక్కడెక్కడో ఉన్న వాళ్లంతా సొంతూళ్లకు వచ్చి ఓట్లేశారు. మరి ఆ ఓట్లన్నీ ఎక్కడికి వెళ్లినట్లు. ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందనేందుకు ఏకపక్ష ఫలితాలే నిదర్శనం.

– అలువాల వెంకట్రామి రెడ్డి, గోనెగండ్ల

క్లుప్తంగా

ఘనంగా విత్తన దినోత్సవం


ఉత్తమ రైతుల్ని సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(సెంట్రల్): అన్నదాతలు మేలైన విత్తనాలు వాడి అధిక దిగుబడులు పొందాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్‌ఏఆర్‌ఎస్) సహ సంచాలకురాలు డాక్టర్ సరళమ్మ పిలుపునిచ్చారు. బుధవారం పరిశోధనా స్థానంలో విత్తన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఆర్‌ఏఆర్‌ఎస్‌లో మేలైన వంగడాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు తాము పండించిన పంట నుంచే విత్తనాలను సేకరించుకొని భద్రపరచుకోవాలని సూచించారు. ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ సుజాతమ్మ, డాక్టర్ నరహరి మాట్లాడుతూ.. రైతులు మేలైన విత్తనంతో పాటు భూసారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. రైతులు తమ విత్తనాన్ని రెండు నుంచి మూడు సంవత్సరాలు వాడుకోవచ్చని, దీంతో విత్తు ఖర్చు తగ్గడంతో పాటు విత్తన లభ్యతను పొందవచ్చని తెలిపారు. డాక్టర్ ఆర్.నరసింహులు, డాక్టర్ మోహనవిష్ణువర్ధన్, డాక్టర్ నీలిమ, డాక్టర్ ఫుల్లీబాయ్ చిరుధాన్యాల విత్తనోత్పత్తి, పత్తి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఉత్తమ విత్తనోత్పత్తి సాధించిన రైతులను డా.సరళమ్మ చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానం చేశారు. కార్యక్రమంలో పలువురు రైతులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు 5 మేకలు మృతి



కౌతాళం: మండల పరిధిలోని ఓబుళాపురం గ్రామ సమీపంలో పిడుగుపాటుకు 5 మేకలు మృతి చెందాయి. బుధవారం మధ్యహ్నం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కోసిగి మండలానికి చెందిన మేకల కాపరి మలిగేరి ఆంజనేయ గొర్రెల మంద, జీవాలను ఓబుళాపురం పొలాల్లో మేపుతుండ గా పిడుగు పడి 5 మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. రూ.80 వేల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నారు.

కోలుకోలేక యువకుడి మృతి


మృతి చెందిన వెంకట దొర

శిరివెళ్ల: తన భార్యను కాపురానికి పంపడంలేదనే మనస్తాపంతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ యువకుడు కోలుకోలేక మృతిచెందాడు. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాలు.. రుద్రవరం మండలం ఆలమూరుకు చెందిన గోషా వెంకట దొర(23) ఇటీవల నంద్యాలలోని దేవనగర్‌కు చెందిన ప్రియాంకను ప్రేమ వివాహం చేసుకున్నాడు. అమ్మాయి తల్లిదండ్రులు గతనెల మొదటి వారంలో ఆలమూరుకు వచ్చి అబ్బాయి తల్లిదండ్రులతో రాజీ పడ్డారు. తమ కుమార్తెను కొన్నిరోజులు ఇంటికి తీసుకువెళ్తామని చెప్పి వెంట తీసుకెళ్లారు. ఆ తర్వాత రోజులు గడుస్తున్నా పంపకపోవడంతో పాటు పలుమార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదు. దీంతో గత నెల 28న తానే వెళ్లి తన భార్యను తీసుకొస్తానని ఇంట్లో చెప్పి వెంకట దొర నంద్యాలకు బయలుదేరాడు. మార్గమధ్యలో శిరివెళ్లలోని జెడ్పీ ఉన్నత పాఠశాల వెనుక పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని సమాచారాన్ని తల్లిదండ్రులకు చేరవేసి, యువకుడిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం తల్లిదండ్రులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గ్యాప్.. ఎంతో మేలు!

- గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ (గ్యాప్) పద్ధతులపై అన్నదాతల దృష్టి
- తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు
- భూసార పరీక్షల సిఫార్సుల మేరకు రసాయన ఎరువుల వాడకం
- పత్తిలో హెక్టారుకు వాస్తవ పెట్టుబడి రూ.1.20 లక్షలు
- 'గ్యాప్'తో కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ రూ.82,923



గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ కింద సాగు చేసిన కొర్ర, వరి పంటలు

కర్నూలు(అగ్రికల్చర్): గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ (గ్యాప్) పద్ధతులతో పంటలు పండిస్తూ రైతులు పెట్టుబడి ఖర్చు తగ్గించుకుంటున్నారు. నాణ్యమైన దిగుబడులు సాధిస్తూ నికరాదాయాన్ని పొందుతున్నారు. జిల్లా వ్యవసాయ యంత్రాంగం 2024–25 సంవత్సరానికి సంబంధించి గ్యాప్ పద్ధతులతో కాస్ట్ ఆఫ్ కల్టివేషన్‌ను(పెట్టుబడి ఖర్చును) అంచనా వేసింది. విత్తనానికి ముందు భూమి సిద్ధం చేసుకునేది మొదలు.. పంట కోత, పంట నూర్పిడి వరకు పెట్టుబడి వ్యయాన్ని పక్కాగా లెక్కించింది. ఒక క్వింటా పంట పండించడానికి ఎంత ఖర్చు వస్తుంది... హెక్టారుకు సగటున ఎన్ని క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.. మార్కెట్‌లో ధర ఎంతుంటుంది. ఈ ప్రకారం పెట్టుబడి వ్యయం అనే దానిని తేల్చింది. జిల్లాలో ప్రధానంగా సాగుచేసే పంట పత్తి కాగా..హెక్టారుకు కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ రూ.82,923 ఉన్నట్లు లెక్కించింది. పత్తిలో హెక్టారుకు వాస్తవ సాగు ఖర్చు రూ.1.20 లక్షల వరకు ఉంటోంది. సగటున దిగుబడి 13 క్వింటాళ్లు వస్తుండగా.. క్వింటాకు పెట్టుబడి వ్యయం రూ.6,398 అవుతోంది. గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ పద్ధతులో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకోవడంతోపాటు నాణ్యమైన దిగుబడులు సాధించి నికరాదాయాన్ని పొందవచ్చు.

భూసార పరీక్ష ఫలితాలు ప్రామాణికం

గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ (గ్యాప్) పద్ధతిలో భూసార పరీక్షలను ప్రామాణికంగా తీసుకోవాల్సి ఉంది. ఫలితాలను అనుసరించి సిఫార్సు చేసిన మేరకే రసాయన ఎరువులు, సూక్ష్మ పోషకాలు వినియోగిస్తే పెట్టుబడి వ్యయాన్ని బాగా తగ్గించుకోవచ్చు. జిల్లాలో కొన్నేళ్లుగా రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం పెరిగిపోయింది. దీంతో పెట్టుబడి వ్యయం గణనీయంగా పెరిగి నికరాదాయం తగ్గుతోంది. జిల్లాలో ప్రధానంగా పత్తి, వరి, వేరుశనగ, మొక్కజొన్న, జొన్న,సజ్జ, మినుము, కంది, మిర్చి పంటలు సాగు చేస్తున్నారు. అధికోత్పత్తి లక్ష్యంగా పోటీపడి కెమికల్స్ వాడుతున్నారు. మనం ఆహారం ద్వారా ప్రతి రోజు 362.5 మిల్లీగ్రాముల పురుగు మందుల అవశేషాలు శరీరంలోకి వెళ్తున్నాయని, ఇది చాలా ప్రమాదకరమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గ్యాప్ పద్ధతుల ద్వారా పండించిన రసాయన అవశేషాలు లేని ఆహార పంటలకు మార్కెట్లో డిమాండ్ లభిస్తోంది.

నికరాదాయం

గతేడాది కర్నూలు, నంద్యాల జిల్లాల్లో గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ కింద కొర్ర, వరి సాగు చేశారు. నాణ్యమైన దిగుబడు రావడంతో వీటికి ప్రభుత్వం ఆర్గానిక్ సర్టిఫికెట్లు ఇచ్చింది. గత ఏడాది మామూలు పద్ధతుల్లో పండించిన కొర్రలు క్వింటాలుకు రూ.5000 వరకు ధర లభించింది. గ్యాప్ పద్ధతులతో పండించిన కొర్రలకు రూ.7000 ధర వచ్చింది. మామూలు పద్ధతులతో పోలిస్తే గ్యాప్ పద్ధతులతో పండించిన వరి బియ్యానికి మార్కెట్‌లో 50 శాతం వరకు అధిక ధర లభిస్తోంది. పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకోవడానికి, నాణ్యమైన దిగుబడులు పెంచుకొని నికరాదాయం పొందడానికి వందలాది మంది రైతులు 'గ్యాప్' పద్ధతులు పాటిస్తున్నారు.

వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ ఇలా ఉంది...

పంట	పెట్టుబడి వ్యయం హెక్టారుకు రూపాయల్లో..
వరి	1,07,896
జొన్న	67,284
పత్తి	82,923
వేరుశనగ	92,750
కంది	56,075
పెసర	70,016
మినుము	70,016
సజ్జ	33,784
మొక్కజొన్న	57,949
పొద్దుతిరుగుడు	55,500
కొర్ర	27,313

పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకోవాలి

వ్యవసాయంలో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ కింద వివిధ పంటల సాగును ప్రోత్సహిస్తున్నాం. గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ కింద ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించవచ్చు. శాస్త్రీయంగా పంటల వారీగా కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ సిద్ధం చేశాం. కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ ఆధారంగానే పంటలకు కనీస మద్దతు ధరలను ప్రభుత్వం ఖరారు చేస్తుంది. పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకోవడానికి భూసార పరీక్ష ఫలితాలు తోడ్పడుతాయి. ఈ ఏడాది పెద్ద ఎత్తున భూసార పరీక్షలు చేపడుతున్నాము. రైతులు కూడా సొంతంగా భూసార పరీక్షలు చేయించుకొని పంటలు సాగు చేయడం ద్వారా వ్యవసాయంలో రాణించవచ్చు. జిల్లాలో ఎమ్మిగనూరు, కర్నూలుల్లో భూసార పరీక్షలు నిర్వహిస్తారు.

– పీఎల్ వరలక్ష్మి, డీఏవో, కర్నూలు

రైలు ఢీకొని వ్యక్తి మృతి


మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

కర్నూలు: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యకి ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని దుర్మరణం పాలయ్యారు. బుధవారం మధ్యాహ్నం బంగారుపేట–ఇందిరాగాంధీనగర్ మధ్యలో రెండు కుళాయిల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. కర్నూలు రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ కె.లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. దాదాపు 35 ఏళ్ల వయస్సు కలిగి నీలం రంగు ఫుల్ హ్యాండ్స్ షర్టు, బ్రౌన్ కలర్ జీన్స్ ప్యాంటు, 5.6 అడుగుల ఎత్తు, చామన ఛాయ రంగు కలిగి ఉన్నాడని, కుడి, ఎడమవైపు వీపున నల్లటి పుట్టు మచ్చలు ఉన్నాయని తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు రైల్వే పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్ సెల్ నెంబర్ 9441970940కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

బాలిక అదృశ్యం


శాంతమణి(ఫైల్)

బనగానపల్లె రూరల్: పట్టణంలోని పెండేకంటి నగర్ కాలనీకి చెందిన 13 ఏళ్ల బాలిక తలారి శాంతమణి అదృశ్యమైనట్లు బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రామిరెడ్డి తెలిపిన వివరాలు.. తలారి సావిత్రి తన భర్తతో మనస్పర్థల కారణంగా విడిపోయి కూతురు శాంతమణితో కలిసి ఉంటోంది. ఈనెల 3న దుకాణానికి వెళ్లొస్తానని ఇంట్లో నుంచి వెళ్లిన బాలిక తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు.. స్నేహితులు, బంధువుల వద్ద ఆరా తీశారు. ఆచూకీ లేకపోవడంతో తల్లి సావిత్రి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు

బనగానపల్లె: అవుకు మండలం రామాపురంలో టీడీపీ కార్యకర్తలు బుధవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు తెగబడ్డారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు రోడ్లపై కనిపిస్తే చాలు టీడీపీ నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోయి మూకుమ్మడిగా దాడులకు పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శివ దస్తగిరి రోడ్డుపై ఉండగా ఎలాంటి కారణం లేకుండానే దాడి చేశారు. అతని బైక్‌ను ధ్వంసం చేశారు. అనంతరం వలంటీర్ శివపై దాడి చేశారు. సుధాకర్ అనే వృద్ధుడిపై సైతం దాడి చేసి గాయపరిచారు. టీడీపీ కార్యకర్తల దాడిలో మరో వైఎస్సార్‌సీపీ కార్యకర్త బోయ రా మచంద్రుడు, అతని తమ్ముడికి రక్తగాయాలు, వారి కుటుంబ సభ్యులు ముగ్గురికి మూగ దెబ్బలు తగిలాయి. పోలీసులు గ్రామానికి చేరుకొని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించకుండా స్టేషన్‌కు తీసుకెళ్లి వారిపైనే కేసులు నమోదు చేసినట్లు బాధితులు ఆరోపించారు. కాగా దాడికి పాల్పడిన వారిలో కేవలం ఒక్కరిని మాత్రమే స్టేషన్‌కు తీసుకెళ్లి కేసు నమోదు చేయడంతో పోలీసుల తీరుపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

దంపతులకు గాయాలు

రుద్రవరం: మండల పరిధిలోని ఆర్.నాగులవరం–తిప్పారెడ్డిపల్లె గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. టీ.లింగందిన్నెకు చెందిన హరిక్రిష్ణ, శిరీష దంపతులు బుధవారం తమ ఎనిమిది నెలల చిన్నారి వైద్యం కోసం మోటార్ సైకిల్‌పై రుద్రవరం వెళ్లా రు. అనంతరం తిరిగి వెళ్తుండగా ఆర్.నాగులవరం దాటగానే ఎదురుగా వస్తున్న ఆటో అదుపు తప్పి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. రుద్రవరం పోలీసలు అక్కడికి వెళ్లి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రెండు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి


మృతి చెందిన మాల మల్లయ్య(ఫైల్)

నందవరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమిని తట్టుకోలేక కనకవీడు గ్రామానికి చెందిన ఆ పార్టీ నాయకుడు మాల మల్లయ్య(62) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపిన వివరాలు ఇవి..మంగళవారం జరిగిన కౌంటింగ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలు కావడంతో మాల మల్లయ్య టీవీ చూస్తూ హఠాత్తుగా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి డాక్టర్‌ను సంప్రదించగా మృతి చెందినట్లు నిర్ధారించారు. వైఎస్సార్‌సీపీ ఓటమి కావడంతో గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహానికి పూలమాల వేసి వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేఆర్ లక్ష్మీకాంత రెడ్డి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మట్టి ఖర్చులకు ఆయనతో కలిసి గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరాముడు రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. నివాళులర్పించిన వారిలో పెద్ద ఈరన్న, సారాయి ఈరన్న, చంద్రబాబునాయుడు, జగనాథ్ తదితరులు ఉన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

ప్యాపిలి: మండల పరిధిలోని వెంకటాంపల్లి బస్‌స్టేజీ వద్ద బుధవారం జరిగిన రోడ్డుప్రమాదంలో పట్టణానికి చెందిన జింకల రమేశ్ (23) మృతి చెందాడు. బీసీ కాలనీలో నివాసం ఉంటున్న రమేశ్ సొంత పని నిమిత్తం ద్విచక్రవాహనంపై ఎస్.రంగాపురం గ్రామానికి వెళ్లాడు. పని ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఉన్న అతన్ని బనగానపల్లె వైపు వెళ్తున్న కారు అతివేగంగా ఢీకొంది. ప్రమాదంలో రమేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ప్యాపిలి పోలీసులు తెలిపారు.


కొండ చిలువ కలకలం


మంటల్లో నుంచి బయటకు వెళ్తున్న కొండచిలువ

రుద్రవరం: మండల పరిధిలోని మాచినేనిపల్లె చిన్న చెరువులో కొండ చిలువ కలకలం రేపింది. ఇటీవల వర్షం కురవడంతో రైతులు పొలాల్లో వ్యవసాయ పనులు చేపట్టారు. ఇందులో భాగంగానే గ్రామానికి చెందిన రైతులు సమీపంలోని చిన్న చెరువు చుట్టుపక్కల పొలాల గట్లపై ఉన్న గ్రాసానికి నిప్పు పెట్టారు. వేడిమికి తాళలేక కొండ చిలువ బయటకు రావడం గమనించి రైతులు భయాందోళనతో పరుగులు తీశారు. కొండ చిలువను పట్టి తీసుకెళ్లాలని అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆలయ భూములకు బహిరంగ వేలం

మహానంది: బండిఆత్మకూరు మండంలోని ఆలయ భూములకు వేలాలు నిర్వహించనున్నట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 8న బండిఆత్మకూరులోని శ్రీ లక్ష్మీ జనార్దన, ఆంజనేయ స్వామి ఆలయంలో, అదే రోజు సాయంత్రం బి.కోడూరులోని శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో భూముల వేలాలు ఉంటాయన్నారు. 10న భోజనం గ్రామంలోని శ్రీ ముక్తి ఈశ్వరస్వామి, అదేరోజు సాయంత్రం నారాయణపురంలోని శ్రీ ఆంజనేయ, శ్రీ నారాయణస్వామి ఆలయాల్లో భూములకు వేలం పాట నిర్వహిస్తామని చెప్పారు. 13న ఓంకారం ఆలయానికి చెందిన భూమికి పార్నపల్లెలో, 15న సంతజూటూరులోని శ్రీ చెన్నకేశవ, ఆంజనేయస్వామి, సాయంత్రం జి.లింగాపురంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో, 16న ఈర్నపాడులోని శ్రీ ఈశ్వర, చెన్నకేశవస్వామి ఆలయ భూములకు వేలాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 17న పెద్దదేవలాపురంలోని శ్రీ వరదరాజ, శ్రీ ఆంజనేయ, లింగమయ్య స్వామి ఆలయాల భూములకు, 19న శింగవరంలోని శ్రీ వెంకటేశ్వర, ఆంజనేయ స్వామి, ఓంకారంలో ఓంకారేశ్వర స్వామి దేవస్థానం, 20న కడమలకాల్వలోని శివనంది ఆలయంలో వేలాలు ఉంటాయని వివరించారు.



నీలి'గిరులు'

చుట్టూ చెట్లు.. పైన నీలి ఆకాశం. దూరంగా కొండలు.. ఎంత బాగుందో అనుకుంటున్నారా..? అయితే మీరు పొరపాటు పడినట్లే. అవి కొండలు కావు, నీలి ఆకాశంలో కొండల్లా కనిపించిన మేఘాలు. ఈ దృశ్యం బుధవారం సాయంత్రం గడివేముల మండలం బిలకలగూడూరు గ్రామ సమీపంలో ఆవిష్కృతమైంది.

–గడివేముల

అటవీ సంరక్షణకు బేస్ క్యాంప్‌ల ఏర్పాటు

- ప్రొటెక్షన్ వాచర్ల నియామకంతో భద్రత పెంపు


నాగంబావి సమీపంలో ఏర్పాటు చేసిన బేస్ క్యాంప్


విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ప్రొటెక్షన్ వాచర్లు

రుద్రవరం: నల్లమల అటవీ సంరక్షణకు ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. రుద్రవరం రేంజిలో రెండు బేస్ క్యాంప్‌లను ఏర్పాటు చేసి వాటికి ఇటీవల ప్రొటెక్షన్ వాచర్లను నియమించారు. వారు రాత్రీపగలు అక్కడే ఆవాసాలు ఉంటూ విధులు నిర్వహిస్తున్నారు. రుద్రవరం రేంజ్ ఐదు సెక్షన్లు, 11 బీట్‌లుగా విస్తరించి ఉంది. ఒక్కో బీట్‌కు ఒక ఎఫ్‌బీఓ, ఏబీఓ చొప్పున 11 బీట్లకు 22 మంది, ఐదు సెక్షన్‌లకు ఐదుగురు ఫారెస్టర్లు, ఒక డీఆర్వో, రేంజ్ అధికారి ఉండాలి. కానీ కొన్ని బీట్లకు సిబ్బంది కొరత ఉంది. గతంలో అక్కడక్కడా ఐదు బేస్ క్యాంప్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో బేస్ క్యాంప్‌లో ఐదుగురు చొప్పున ప్రొటెక్షన్ వాచర్లను నియమించారు. కాలక్రమేణా కొన్ని బేస్ క్యాంప్‌లను తొలగించారు. ప్రస్తుతం రుద్రవరం రేంజ్‌లోని చీతల్, ఉట్ల, నిచ్చెన్లబావి వద్ద బేస్ క్యాంప్‌లు ఉన్నాయి. ఆయా బేస్ క్యాంప్‌ల వద్ద ప్రొటెక్షన్ సక్రమంగా విధులు నిర్వహిస్తూ అటవీ సంరక్షణకు పాటు పడుతున్నారు. రేంజ్ పరిధిలోని రుద్రవరం, నూతల సెక్షన్‌ల నుంచి వెదురు, వివిధ జాతులకు చెందిన కలప అక్రమంగా తరలిపోకుండా ఉండేందుకు అక్కడ రెండు బేస్ క్యాంప్‌లను ఏర్పాటు చేయాలని ఆ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. అందులో భాగంగా ఇటీవల నాగం బావి, శిల్లమాను పెంట వద్ద బేస్ క్యాంప్‌లను ఏర్పాటు చేశారు. నాగం బావి వద్ద అహోబిలం చెంచు కాలనీకి చెందిన లక్ష్మీనారాయణ, సురేంద్ర, ఆంజనేయలను ప్రొటెక్షన్ వాచర్లుగా యమించారు. వారు తమ కుటుంబాలతో కలిసి అక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకొని అటవీ సంపదను కాపాడుతున్నారు.

చిటుకు రోగాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

- గొర్రెల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి
- టీకాలు వేయిస్తే వ్యాధి నివారణ సాధ్యం
- తొలకరి వర్షాలు, అకాల వర్షాలకు మొలిచిన గడ్డిని ఎక్కువగా మేపరాదు
- పశువ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ రవిబాబు సూచనలు


గొర్రెల పెంపకందారులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రవిబాబు

కర్నూలు అగ్రికల్చర్ : గొర్రెల పెంపకందారులకు తీవ్ర నష్టం కలిగించే వ్యాధి చిటుకు రోగం. ఇందులో 40 శాతం వరకు మరణాల రేటు ఉంటుంది. ఈ వ్యాధి సోకిన గొర్రెలు నిమిషాల్లోనే చనిపోతాయి. గొర్రెల పెంపకందారులు ప్రధానంగా చిటుకు రోగంపై అప్రమత్తంగా ఉండాలి. ఈ వ్యాధి సోకితే చిటికెలో గొర్రెలు మరణించే ప్రమాదం ఉన్నందువల్ల దీనిని చిటుకు రోగం అంటారు. ఈ వ్యాధి నివారణకు ప్రస్తుతం టీకాలు వేసే కార్యక్రమం జరుగుతోంది. వ్యాధితో గొర్రెలకు నష్టం జరుగకుండా ఉండేందుకు టీకాలు వేయించాల్సిన అవసరం ఉంది. టీకాల కార్యక్రమం మొదలైన నేపథ్యంలో గొర్రెల్లో ఈ వ్యాధి ఎప్పుడు వస్తుంది, లక్షణాలు ఎలా ఉంటాయి, నివారణ పద్ధతులను కర్నూలు పశువ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ రవిబాబు(99490 01430) వివరించారు. వ్యాధిని సకాలంలో గుర్తిస్తే తగిన జాగ్రత్తలు తీసుకొని నష్టాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు. వివరాలు ఆయన మాటల్లోనే...

'' గొర్రెలకు సోకే వ్యాధుల్లో ఇది ప్రమాదకరమైంది. ఈ వ్యాధి రాకుండా చేసుకునేందుకు ముందు జాగ్రత్తగా టీకాలు వేయించాలి. పశు సంవర్ధక శాఖ చిటుకు వ్యాధి నివారణకు జూన్ నెలలో టీకాలు వేసే కార్యక్రమం చేపట్టింది. గొర్రెల పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ వ్యాధిని గడ్డి రోగం, ముచ్చువ్యాధి, మెడసరం, నెత్తి పిడుగు వ్యాధిగా కూడా వ్యవహరిస్తారు.

వీటికి ఎక్కువగా సోకుతుంది...

సంవత్సరం వయస్సున్న గొర్రెల్లో ఎక్కువగా వస్తుంది. దృఢంగా ఆరోగ్యంగా ఉన్న జీవాల్లోను, వలస గొర్రెల్లోను వ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది. అయితే మేకల్లో ఈ వ్యాధి తీవ్రత అంతగా ఉండదు. ఈ వ్యాధి తొలకరిలో ఎక్కువగా వస్తుంది. అందుల్లోను ఉదయం, మధ్యాహ్నం వేళల్లో ఎక్కువ ప్రభావం చూపుతుంది.

ఎలా సోకుతుందంటే...

తొలకరిలో పెరిగిన పచ్చికను అతిగా మేయడం వల్ల శరీరంలో ఎప్సిలాల్ అనే విష పదార్థం విడుదల కావడం వల్ల వ్యాధి సంభవిస్తుంది. మేతను తీసివేసి అకస్మాత్తుగా దాణాను మార్చడం వల్ల కూడా వచ్చే అవకాశం ఉంది. ఒకేసారి ఎక్కువ పాలు లేదా మేతను పిల్లలకు అందించడం వల్ల శరీరంలో అంతర పరాన్న జీవులైన బద్దె పురుగులు, ఏలికపాములు, ఉండటం వల్ల ఎక్కువగా పిండి పదార్థాలు ఉండే జొన్నలు, సజ్జలు, బియ్యం ఆహారంగా తీసుకోవడం వల్ల ఎండుగడ్డిని తక్కువగా తీసుకోవడంతో వ్యాధి సోకుతుంది. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే గొర్రెల్లో కనిపిస్తుంది.

లక్షణాలు..

రాత్రి బాగా ఉండి, తెల్లారే సరికల్లా ఎక్కువ సంఖ్యలో జీవాలు మరణించడం కనిపిస్తుంది. జీవాలు కళ్ల ముందే ఎలాంటి లక్షణాలు లేకుండా హఠాత్తుగా, గాలిలోకి చెంగున ఎగిరి కిందపడి అకస్మాత్తుగా మరణిస్తాయి.

- జ్వరం, పళ్ల కొరకడం, వణకడం, బిగుసుకొనిపోవడం, కాళ్లతో పొట్టను తన్నుకోవడం, చెట్లకు గట్టిగా తలను ఆనించి ఉండటం, కాళ్లు బిగిసి నడవడం, శ్వాసకష్టమవడం మొదలగు లక్షణాలు కనిపిస్తాయి.
- వ్యాధి తీవ్రత దశలో అధిక విరేచనాలు కడుపు నొప్పి, మందకొడిగా ఉండటం, మేత సరిగ్గా తినకపోవడం జరుగుతుంది. కాళ్లను కొట్టుకుంటూ అకస్మాత్తుగా చనిపోతాయి. చనిపోయే ముందు కొద్దిగా పారుకుంటాయి. పెండలో ఒక్కోసారి రక్తం కూడా వస్తుంది

నివారణ ఇలా...

- వ్యాధి రాకుండా ముందుగానే వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. అకాల వర్షాలు, తొలకరివర్షాల వల్ల పెరిగిన గడ్డిని గొర్రెలకు ఎక్కువగా మేపరాదు.
- పొద్దుతిరుగుడు పూలకంకులను వరికోసిన తర్వాత మిగిలిన వరికర్రలను ఎక్కువగా మేపరాదు. గొర్రెలు, మేకలకు మూడు నెలలకు ఒకసారి నట్టల నివారణ మందులు తాపించాలి.
- గొర్రె, మేక పిల్లలకు 30 రోజులు దాటిన తర్వాత వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. 3 నెలల తర్వాత బూస్టర్ డోస్ వేయించాలి. గొర్రెలకు, మేకలకు ఆరు నెలలకు ఒకసారి వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. గొర్రె పిల్లలు అత్యధికంగా పాలు తాగకుండా గమనించాలి.
- పాలు తాగే స్థితి నుంచి ఒకేసారి దాణాకు మార్చకుండా క్రమ క్రమంగా మార్చుకుంటూ వెళ్లాలి.
- మేకలకు పూర్తిగాపప్పు జాతి పశుగ్రాసాలను మేపరాదు.

చికిత్స...

సాధారణంగా వ్యాధి సోకిన జీవాలకు చికిత్స చేసే వ్యవధి ఉండదు. వ్యాధి దీర్ఘకాలికంగా సోకిన సందర్భాల్లో మాత్రం విరేచనాలు తగ్గడానికి నెబ్లాన్ 10–15 గ్రాములు, ఆంటిబయాటిక్‌లు నోటి ద్వారా ఇవ్వాలి. డెక్స్ట్రోజ్ సెలైన్ రక్త నాళాల్లోకి ఎక్కించాలి. పెన్సిలిన్ ఇంజక్షన్స్ ఇప్పించాలి.

టీకాలు వేయడంతో వ్యాధుల నివారణ...

గొర్రెలు, మేకల్లో గాలికుంటు, మశూచి, పీపీఆర్, చిటుకు రోగం, దొమ్మ, గొంతువాపు మొదలైన అంటు వ్యాధులు ఒక మంద నుంచి వేరొక మందకు అత్యంత వేగంగా, సులభంగా వ్యాపించి ప్రాణ నష్టాన్ని కలిగిస్తాయి. చాలా సందర్భాల్లో చికిత్స చేసేందుకు తగిన వ్యవధి కూడా ఉండదు. మరణమే శరణ్యం. చికిత్స తర్వాత ఒకవేళ గొర్రె/మేక బతికి బయట పడ్డా వ్యాధి వల్ల కలిగే దుష్ఫలితాలు ఏడాది కాలం ఉండి బాధ పెడతాయి. ఇలాంటి ప్రమాదకరమైన ప్రాణాంతకమైన వ్యాధులకు చికిత్స బదులు నివారణనే శ్రేయష్కరం అని గుర్తించాలి. అంటు వ్యాధులు సోకక ముందే వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తే గొర్రెలు, మేకల్లో రోగ నిరోధక శక్తి పెంపొందుతుంది.''